డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కని కలిసిన ఎమ్మెల్యే మదన్ మోహన్

కామారెడ్డి వాయిస్ టుడే నవంబర్ 4 : సోమవారం రోజున హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ను ఎమ్మెల్యే మదన్ మోహన్ కలిశారు. ఈ సందర్భంగా, ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి పెండింగ్ బిల్స్‌ను త్వరగా విడుదల చేయాలని డిప్యూటీ సీఎం కోరుతూ వినతి పత్రం అందచేయడం జరిగింది. అంతేకాక, కామారెడ్డి జిల్లా. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు అలాగే లింగంపేట్ మండలంలోని మోతే గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన భూమిని సిద్ధం చేశామని తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ విషయాలకు సానుకూలంగా స్పందించారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వంకు రైతుల ఉసురు తగులుతుంది

కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు తిరగబడే రోజులు దగ్గరపడ్డాయి

వాయిస్ టుడే ప్రతినిధి(హుస్నాబాద్ నియోజకవర్గం) నవంబర్02: సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మాంకాల రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై రైతులు తిరగబడే రోజులు దగ్గర పడ్డాయని రైతుల ఉసురు రేవంత్ రెడ్డి ప్రభుత్వంకు తగులుతుందన్నారు. త్వరలో బి ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాటాలు నిర్వహిస్తామని రైతుబంధుకు ఎగనామం పెట్టి రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. ఎన్నికల ముందు రైతు భరోసా పేరు మీద ఎకరానికి. 7,500 ఇస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చి కనీసం కెసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన రూ.5,000 వేలు కూడా ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. 11 విడతలో నాటి సీఎం కేసీఆర్ రైతులకు రైతుబంధు పేరుతో పెట్టుబడి సాయం అందించారని గుర్తు చేశారు వానాకాలం సీజన్ పూర్తి అయిన తర్వాత రైతు భరోసా ఇవ్వడం లేదని వ్యవసాయం శాఖ మంత్రి చెప్పడం రైతుల పట్ల వారికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు రైతు సంక్షేమమే తొలి ప్రాధాన్యతగా కెసిఆర్ ప్రభుత్వం పాలన సాగించిందన్నారు కరోనా లాంటి కష్ట సమయంలోనూ కెసిఆర్ రైతుబంధు పెట్టుబడి సాయం సమయానికి అందించారన్నారు రైతులను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదించాల్సిన సందర్భం వచ్చిందని అన్నారు రైతు భరోసా పై రైతులకు తిరగబడి రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు రాబోయే రోజుల్లో రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు

కార్తీక మాసం పర్వదినాన్ని పురస్కరించుకుని యాదాద్రిలో మహిళా భక్తులకు ఉచితంగా వాయన తాంబూలం

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట:శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ సన్నిధిలో కార్తీక మాసం పర్వదినాన్ని పురస్కరించుకుని సామూహిక దీపోత్సవము దీపారాధన మహిళా భక్తులకు ఉచితంగా ప్రత్యేక కౌంటర్ ను ఆలయ చైర్మన్ నరసింహమూర్తి ఈఓ భాస్కరరావు ప్రారంభించారు.ప్రతి రోజు సాయంత్రం 6 గ సమయంలో కార్తీక దీపారాధన మహిళా భక్తులు చేసే పూజల కోసం వాయనం తాంబూలంలో పసుపు, కుంకుమ, కనుగు,ఒక్కలు, ఖర్జూరం, తమలపాకులు,లడ్డూ ప్రసాదం ఉచితంగా అందజేస్తామని ఆలయ ఈఓ తెలిపారు.

రుణం మంజూరులో వీఏవో అక్రమాలు

రామన్నపేట: దుబ్బాకలో మహిళా సంఘాలకు రుణాల మంజూరులో అక్రమాలు జరిగాయి. సంఘం సభ్యుల పేరిట మంజూరైన రుణ మొత్తంలో అదనంగా నగదు జమ చేయించి వీఏవో తన ఖాతాలోకి మళ్లించుకొని అవినీతికి పాల్పడ్డాడు. ఈ వ్యవహారంలో రూ.16.80లక్షల వరకు అక్రమాలు జరిగాయని సంబంధిత సిబ్బంది ప్రాథమికంగా పేర్కొంటుండగా, పెద్ద మొత్తంలో ఉంటుందని సదరు వీఏవోపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు రామన్నపేటలో సోమవారం ఆందోళనకు దిగారు. సంబంధిత కార్యాలయం ఎదుట, అనంతరం చిట్యాల, భువనగిరి రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. దుబ్బాకలో మొత్తం 50 సమభావన సంఘాలున్నాయి. ఇద్దరు వీఏవోలున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న లింగస్వామి పరిధిలో 28 సంఘాలు ఉన్నాయి. జనవరి నుంచి మొత్తం 12 సంఘాలకు సభ్యుల అర్హతను బట్టి ఒక్కో సంఘానికి రూ.5 లక్షల నుంచి రూ.15లక్షలు వరకు రుణం ఇప్పించాడు. మంజూరైన రుణాన్ని పొదుపు ఖాతాలో జమ చేస్తారు. అనంతరం సంఘం సభ్యుల తీర్మానం మేరకు సభ్యురాలి ఖాతాలో జమ చేస్తారు. సభ్యురాలు కోరిన రుణానికి అదనంగా మరో రూ.50వేలు, రూ.లక్ష వారి ఖాతాలో జమ చేయించి.. సభ్యురాలు రుణాన్ని డ్రా చేసే సందర్భంలో వారితో సంతకాలు చేయించి.. ఆ డబ్బును వీఏవో తన ఖాతాకు మళ్లించుకున్నాడు. ఓ మహిళా సభ్యురాలు తనకు మంజూరైన రుణం రూ.లక్ష డ్రా చేసుకోగా వారం క్రితం మరో రూ.75 వేలు డ్రా చేసినట్లు చరవాణిలో సందేశం రావటంతో ఆందోళనకు గురైంది. ఈ వ్యవహారంపై బ్యాంకు సిబ్బందిని అడగ్గా.. మీ ఖాతాలో రూ.1.75లక్షలు ఉన్నట్లు వారు సమాధానం చెప్పారు. ఈ విషయం బహిర్గతం కావడంతో మరికొందరు తమ ఖాతాలను తనిఖీ చేసుకోగా.. తీసుకున్న దానికంటే అదనంగా డబ్బులు కనిపించడంతో ఆందోళన బాటపట్టారు. వీవోఏపై చర్యలు తీసుకునే వరకు ఆందోళన విరమించేది లేదని రహదారిపై బైఠాయించారు. జిల్లా కార్యాలయంలో సమావేశంలో ఉన్న వెలుగు ఏపీఎం రాంప్రసాద్ చరవాణిలో మాట్లాడి.. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

ఆమె ప్రతిభ ప్రత్యేకం గురూ

ఖమ్మం: వివాహమయ్యాక ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించాలని నిర్ణయించుకున్నారామె. ఇద్దరు పిల్లల బాధ్యతలు చూసుకుంటూనే చదువు కొనసాగించారు. ఎటువంటి శిక్షణ తీసుకోకుండానే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ప్రత్యేక విద్య స్కూల్ అసిస్టెంట్‌గా రాష్ట్రస్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. తనలాంటి ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు సత్తుపల్లికి చెందిన కె.శ్రావణి. వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్‌గా శనివారం నియామక పత్రాన్ని అందుకున్నారు.

కరోనా అందరిలాగే శ్రావణి జీవితాన్ని మార్చేసింది. విలువైన సమయాన్ని వృథా చేయొద్దని, కుటుంబానికి చేదోడుగా ఉండాలని ఆమె నిర్ణయించుకున్నారు. మళ్లీ చదువు కొనసాగించి ఉద్యోగం సాధించాలని భావించారు. భర్త సహకారంతో ఇద్దరు పిల్లల బాధ్యత చూసుకుంటూనే విద్యాభ్యాసం కొనసాగించారు. పోటీ తక్కువగా ఉంటుందని, కొంచెం కష్టపడితే ఉద్యోగం సాధించవచ్చని ప్రత్యేక బీఈడీకి దరఖాస్తు చేసి సీటు సాధించారు. చదువు పూర్తయ్యాక డీఎస్సీ ప్రకటన వచ్చింది. ప్రత్యేక విద్య ఉపాధ్యాయులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి దరఖాస్తు చేసుకొని సొంతంగా సన్నద్ధత మొదలు పెట్టారు. యూట్యూబ్‌లో 'డిజేబిలిటీ' పేరుతో ఉన్న పాఠాలు, డీఎస్సీ సామగ్రితో పరీక్షలకు సిద్ధమై రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచారు. ఎక్కడా శిక్షణ తీసుకోకుండా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. మొన్నటి వరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేశారు. భర్త శ్రీధర్‌బాబూ అక్కడే ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

మూడు ఉద్యోగాలు..

చాలాకాలం చదువుకు దూరంగా ఉన్నా పట్టుదలతో మళ్లీ విద్యాభ్యాసం కొనసాగించారు శ్రావణి. ఈ ఏడాది స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్‌గా రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. దీంతోపాటు స్పెషల్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులో రాష్ట్ర ప్రథమ, డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ విభాగంలో జిల్లా ద్వితీయ స్థానం సాధించారు. దివ్యాంగ విద్యార్థులకు సేవ చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. బాధిరులకు కొంతమందికి సైగలతో, మరి కొంతమందికి చేతలతో చదువు నేర్పించాల్సి ఉంటుందని, ఓపికతో దివ్యాంగుల సేవకు అంకితమవుతానంటున్నారు కె.శ్రావణి.

రేపటి నుంచి సమగ్ర సర్వే

ఖమ్మం: కుటుంబాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సర్వేను ఇంటింటా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి సర్వే చేపట్టనుంది. 15 రోజుల పాటు సందడిగా ఈ ప్రక్రియ సాగనుంది. సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకాధికారిని సర్కారు నియమించింది. తుది నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమర్పించనున్నారు.

75 అంశాలపై వివరాల సేకరణ

వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర బలహీన వర్గాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపరచటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సర్వే చేపడుతోంది. జిల్లాలోని 6,33,304 కుటుంబాలకు సంబంధించి 75 అంశాలపై వివరాలను అధికారులు సేకరించనున్నారు. కుటుంబ యజమానితోపాటు సభ్యుల వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, కులవృత్తులు, భూములు, గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన పథకాల వివరాలతోపాటు ఆయా కుటుంబాల రాజకీయ నేపథ్యం తదితరాలను పొందుపరుస్తారు. అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకే కాకుండా ప్రభుత్వ పథకాల అమలుకు ఈ సర్వే ఉపకరిస్తుందని సర్కారు భావిస్తోంది.

3,654 ఎన్యుమరేషన్ బ్లాకులుగా విభజన

ఖమ్మం జిల్లాను 3,654 ఎన్యుమరేషన్ బ్లాకు(ఈబీ)లుగా విభజించి సర్వే నిర్వహించనున్నారు. 3,719 మంది ఎన్యుమరేటర్లు విధులు నిర్వర్తించనున్నారు. ఎస్‌జీటీలు, ఏఈఓలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు, ఏపీడబ్ల్యూలు, ఆశా కార్యకర్తలు, సీఆర్పీలు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డ్ అధికారులు, ఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు ఇలా వివిధ శాఖలకు చెందిన సిబ్బంది ఎన్యుమరేటర్లుగా వ్యవహరిస్తారు. పది మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ చొప్పున మొత్తమ్మీద 314 మందిని నియమించారు. 150 ఇళ్లను ఒక ఎన్యుమరేషన్ బ్లాకుగా పరిగణిస్తున్నారు. ఒక్కో ఎన్యుమరేటర్ రోజుకు పది ఇళ్ల చొప్పున 15 రోజుల్లో 150 గృహాలకు సంబంధించిన సర్వే చేయాల్సి ఉంటుంది. ప్రతి ఎన్యుమరేటర్‌కు ప్రత్యేక బ్యాగు అందజేశారు. ఇందులో స్టేషనరీ సహా సర్వే కాపీలు ఉంటాయి. సర్వే వివరాలను ఏరోజుకారోజు మండలాల వారీగా ప్రత్యేకంగా నియమించిన ఆపరేటర్లతో ఆన్‌లైన్ చేస్తారు. సర్వే నిర్వహించే ప్రాంతాల్లో ఒకరోజు ముందుగానే చాటింపు వేస్తారు. ప్రజలు అందుబాటులో ఉంటూ అన్ని ధ్రువపత్రాలను దగ్గర ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటిస్తారు.

సర్వే పూర్తయ్యే వరకు ఒంటి పూట బడులు

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: సమగ్ర సర్వేలో జిల్లాలో 1,500 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు భాగస్వాములు కానున్నారు. వీరికి ఖమ్మంలో సోమవారం శిక్షణనిచ్చారు. సర్వే పూర్తయ్యే వరకు జిల్లాలోని ప్రభుత్వ ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తరగతులుంటాయి. విద్యార్థుల మధ్యాహ్న భోజన కార్యక్రమం పూర్తయిన తర్వాత ఉపాధ్యాయులు సర్వేలో పాల్గొంటారు. బుధవారం నుంచి ఈనెల 22 వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఒక్కపూట మాత్రమే పనిచేస్తాయని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు.

కలెక్టర్ సమీక్ష

సమగ్ర సర్వేపై కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం సమీక్షించారు. ఒక్కో కుటుంబం వివరాల సేకరణకు 30 నిమిషాల సమయం పడుతుందన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఆర్డీఓ సన్యాసయ్య పాల్గొన్నారు.

పత్తి పంటను పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేయాలి

అధికారుల మధ్య కొరవడిన సమన్వయం

కలెక్టర్ చొరవ తీసుకోవాలని డిమాండ్

భారత రాష్ట్ర సమితి నేత రాజుల ఆశి రెడ్డి

మక్తల్ అక్టోబర్ 4 వైస్ టుడే ప్రతినిధి: పత్తి పంటను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి డిమాండ్ చేశారు. పది రోజులు కింద మక్తల్ మండలంలోని రైతులు నేషనల్ హైవే పై గుడిగండ్ల దగ్గర ఉన్న లక్ష్మీ దుర్గకాటన్ మిల్ లో కాటన్ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిందని.. ప్రభుత్వం నియమించిన వ్యవసాయ అధికారుల బృందం గ్రామాల వారీగా ఏ సర్వే నెంబర్లలో ఏ ఏ రైతులు పత్తి పండించా రో వారి లిస్టును తయారుచేసి ప్రభుత్వానికి సమర్పించారని.. కానీ ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు నష్టపోతున్నారని వాపోయారు. వెంటనే సమస్య పరిష్కారం చేయకపోతే రైతుల తరఫున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ వెంటనే చొరవ తీసుకొని తప్పులతడకగా రూపొందించిన పంటల సాగు లిస్టును పట్టించుకోకుండా రైతు తెచ్చిన ప్రతి పత్తి పంటను పాసుబుక్కును ఎంట్రీ చేసుకొని వెంటనే కొనుగోలు చేసేటట్లు ఏర్పాట్లు చేయాలని కోరారు. నాయకులు గుడిగండ్ల కురుమయ్య , తిరుపతయ్య , మాజీ ఎంపీటీసీ నర్సిరెడ్డి , మాజీ సర్పంచ్ కిష్టప్ప , మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, లింగం గౌడ్, కాచువార్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎం జయానంద్ , యువ నాయకుడు గార్లపల్లి నర్సింహారెడ్డి , గుడిగండ్ల శివ నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విద్యార్థులకు దేవాలయాలు

టి వై ఆర్ ఫౌండేషన్ చైర్మన్ తల కొక్కుల రాజులి

వాయిస్ టుడే ప్రతినిధి(హుస్నాబాద్ నియోజకవర్గం)అక్టోబర్04: సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల లో ఈరోజు టీ వై ఆర్ ఫౌండేషన్ చైర్మన్ తల కొక్కుల రాజు మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి సందర్శించి గ్రంథాలయాలు విజ్ఞాన దీపికలు అని విద్యార్థులకు దేవాలయం లాంటి వని కొనియాడారు. జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో విద్యార్థినీ విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు ఉన్నత పాఠశాలకు టి వై ఆర్ ఫౌండేషన్ చైర్మన్ తల కొక్కుల రాజు సౌజన్యంతో దాదాపు మూడు వందలకు పైగా పుస్తకాలు బీరువాను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మయయ్య కు అందచేస్తామని అని అన్నారు ప్రధానోపాధ్యాయులు పద్మ య్య మాట్లాడుతూ మా బస్వాపూర్ పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు బీరువా అందజేస్తానన్న తల కొక్కుల రాజు కు ధన్యవాదాలు తెలిపారు విద్యార్థినీ విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞాన సంపద కోసం జనరల్ నాలెడ్జ్ మరియు మహనీయుల పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలోవిశ్రాంత ఉపాధ్యాయులు పుల్లూరు యాదగిరి బస్వాపూర్ మాజీ ఎంపీటీసీలు కొక్కుల బ్రదర్స్ మాజీ ఉపసర్పంచ్ మాంకాల అంజయ్య తాటిపాముల లింగం సానది సింగరయ్య ఎండీ ఇక్బాల్ మాంకాల రమేష్ జ్యోతి ఆంజనేయులు తాటిపాముల శ్రీనివాస్ నందిని ఉపాధ్యాయులువిద్యార్థులు తదితరులు అందరూ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట:వాటర్ ట్యాంకర్ డివైడర్ ను ఢీకొని టాక్టర్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది..పోలిసులు తెలిపారు వివరాల ప్రకారం సోమవారం మధ్యన సమయంలో వాటర్ ట్యాంకర్ తో భువనగిరి మండలం మూత్తిరెడ్డి గూడెం గ్రామంలో వాటర్ పోయానికి వెళుతున్న సమయంలో డివైడర్ ను డీ కొనడంతో ట్రాక్టర్ బోల్తా పడింది దీంతో డ్రైవర్ గజ్జి నరసింహ (43) అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు.వెంటనే సంచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.మృతుడు భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రేపటి వరకే అవకాశం

పట్టభద్రులూ.. ఓటరుగా నమోదు చేసుకోండి

కరీంనగర్ కలెక్టరేట్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఓటరు నమోదుకు మంగళ, బుధవారాలే అవకాశముంది. జిల్లా ఉన్నతాధికారులు, ఎమ్మెల్సీ ఔత్సాహిక అభ్యర్థులు ఓటరు నమోదుకు తహసీల్దార్ కార్యాలయాలు, కళాశాలలు, తదితర ప్రాంతాల్లో కేంద్రాలను తెరిచి ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. సోమవారం వరకు పట్టభద్రుల ఓటర్లు 1,18,822 నమోదు కాగా.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా 5,180 మాత్రమే నమోదయ్యారు. గత 2019 ఎన్నికల సమయంలో పట్టభద్రులు 1,96,321 మంది, ఉపాధ్యాయులు 23,214 మంది ఓటరుగా నమోదు చేసుకున్నారు. ఈ రెండు రోజుల్లో గతానికంటే మించి నమోదు చేసుకుంటారో లేదా చూడాలి మరి. ఈనెల 23న ముసాయిదా..: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హత కలిగిన వారు ఈనెల 6వ తేదీ వరకు ఓటరుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ప్రకటనలో సూచించారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం మరోసారి నమోదు చేసుకోవాలన్నారు. గడువులోపు నమోదైన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఈనెల 23న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తామన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే నవంబరు 23వ తేదీ నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు తెలియజేయాలని తెలిపారు.